ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 31 జనవరి 2024



కర్ణాటక మద్యం జిల్లాకు యథేచ్ఛగా తరలివస్తోంది. జిల్లా సరిహద్దులను దాటుకుని, ఎక్కడ విక్రయించాలనుకుంటే అక్కడికి వెళ్లిపోతోంది. పట్టణాలు, మారుమూల గ్రామాల్లో సైతం కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో మద్యం నాణ్యత తక్కువ అన్న భావనలో మద్యం ప్రియులు ఉన్నారు. అందుకే కర్ణాటక మద్యానికి డిమాండ్ ఎక్కువగా ఉందని అంటున్నారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలతో భారీగా ఆదాయం పొందుతున్నారు. మద్యం తరలిస్తున్న వారిపై కేసులు పెట్టి, జైలుకు పంపినా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. సెబ్, పోలీసు యంత్రాంగాలు కర్ణాటక మద్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నాయి. మద్యం విక్రేతల నుంచి ముడుపులు అందడం, ఈ దందా వెనుక అధికార పార్టీవారు ఉండటంతో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. - అనంతపురం క్రైం

టెట్రా దందా



అక్కడ రూ.70.. ఇక్కడ రూ.150

జిల్లాలో యథేచ్ఛగా విక్రయాలు

- సరిహద్దు నుంచి వస్తున్న మద్యం
- వైసీపీ సభల్లో భారీగా వినియోగం
- కర్ణాటకలో రూ.70.. ఇక్కడ రూ.150
- పట్టించుకోని పోలీసులు, సెబ్ అధికారులు



అక్టోబరు 31న అనంతపురం సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

టెట్రాపై మోజు

ధరల విషయంలో పెద్దగా వ్యత్యాసం లేకపోయినా కర్ణాటక మద్యం అక్రమ రవాణా కారణం అక్కడి టెట్రా ప్యాకెట్లే అని సమాచారం. దాదాపు అన్ని బ్రాండ్ల ధరలు జిల్లాలోనూ, కర్ణాటకలోనూ సమానంగానే ఉన్నాయి. కొన్ని బ్రాండ్ల ధర కర్ణాటకలోనే ఎక్కువగా ఉంది. కర్ణాటకలో టెట్రా ప్యాకెట్‌లలో మద్యాన్ని విక్రయిస్తున్నారు. దీన్నే జిల్లాకు అధికంగా తీసుకువస్తున్నారు. కర్ణాటక నుంచి కల్తీ మద్యం కూడా వస్తోందన్న ప్రచారం ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఊరూపేరు లేని మద్యం బ్రాండ్లను తీసుకువచ్చారు. దీంతో కర్ణాటక మద్యం వైపు చూడటం మొదలైంది.

జిల్లాలో మద్యం దుకాణాలను ఉదయం 11 గంటలకు తెరిచి.. రాత్రి 9 గంటలకు మూసివేస్తారు. ఉదయమే మద్యం తాగే అలవాటు ఉండి, రాత్రి కొనలేని వారు కర్ణాటక టెట్రా ప్యాకెట్లను వినియోగిస్తున్నారు. ఇవి ఎప్పుడు కావాలంటే అప్పుడు లభించడమే ఇందుకు కారణం. కర్ణాటకలో టెట్రా ప్యాకెట్ 90 ఎంఎల్ రూ.35, 180 ఎంఎల్ ధర రూ.70. అక్కడి నుంచి జిల్లాకు తెచ్చి.. 90 ఎంఎల్‌ను రూ.70, 180 ఎంఎల్‌ను రూ.120 నుంచి రూ.150కి విక్రయిస్తుంటారు. ఒక్కో ప్యాకెట్‌పై రూ.35 నుంచి రూ.80 వరకు ఆదాయం ఉంటోంది. అందుకే అక్రమ రవాణాకు తెగబడుతున్నారు.



నవంబరు 11న సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

సీఎం సభలో..







అక్రమ మద్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఏకంగా ముఖ్యమంత్రి సభలోనే బహిరంగంగా కర్ణాటక మద్యాన్ని వినియోగించారు. జన సమీకరణ కోసం అధికార పార్టీ నాయకులు పొరుగు మద్యాన్ని ఎరవేయడం పరిపాటిగా మారింది. అధికార పార్టీ నాయకుల సభలు, సమావేశాలు నిర్వహించిన ప్రతిసారీ కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. రాయదుర్గం నియోజకవర్గంలోని 74 ఉడేగోళం, శింగనమల నియోజకవర్గంలో నార్పల క్రాస్, కళ్యాణదుర్గంలో నిర్వహించిన ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో తాగునీటికి జనం ఇబ్బంది పడ్డారేగానీ, కర్ణాటక మద్యం మాత్రం ప్యాకెట్లకు ప్యాకెట్లు లభించింది. సభకు వచ్చిన అధికార పార్టీకి చెందిన మద్యం ప్రియులు తాగి చిందులేశారు. కొందరు మత్తు ఎక్కువై అక్కడే పడిపోయారు. తాజాగా ఉరవకొండలో నిర్వహించిన ఆసరా నాలుగో విడత సొమ్ము విడుదల సభలోనూ కర్ణాటక మద్యాన్నే వాడారు. సభ జరిగే ప్రాంతానికి ఒక పెద్ద వాహనం నిండుగా టెట్రా ప్యాకెట్లు వస్తుంటాయని, సభ ముగిశాక ఖాళీగా కనిపించే టెట్రా ప్యాకెట్లే ఇందుకు నిదర్శనమని స్థానికులు అంటున్నారు. సరిహద్దులో తనిఖీలు చేపట్టి.. అక్రమ మద్యాన్ని పట్టుకునే సెబ్, పోలీసు యంత్రాంగానికి ఇవి కనిపించడం లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

దొరికినవన్నీ అవే..

- గత ఏడాది అక్టోబరు 31న గౌరీబిదనూరు నుంచి ఆత్మకూరు మండలం మడిగుబ్బకు కారులో తరలిస్తున్న 15 బాక్సుల కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బాక్సుల్లో 1440 టెట్రా ప్యాకెట్లు ఉన్నాయి. మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు.
- నవంబరు 11న బెంగుళూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యాన్ని జిల్లాకు తీసుకువచ్చారు. గుంతకల్లు చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మాలని అనుకున్నారు. రాప్తాడు మండలం మరూరు టోల్‌ప్లాజా సమీపంలో సెబ్ అధికారులు వారిని పట్టుకున్నారు. కారు సీజ్ చేశారు. అప్పుడు పట్టుబడిన 29 బాక్స్‌లలో 2,784 టెట్రా ప్యాకెట్లు ఉన్నాయి.
- ఈ నెల 12న కుందుర్పి మండలం మహంతిపురం సమీపంలో సెబ్ పోలీసులు 72 బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 14న హులికల్లు చెక్‌పోస్టు వద్ద డి.హీరేహాల్ పోలీసులు 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.



వారం క్రితం పోలీసులు ధ్వంసం చేయడానికి సిద్ధం చేసిన కర్ణాటక మద్యం

స్టేషన్‌లో వ్యాపారం..?

కర్ణాటక మద్యం దందాను కొందరు పోలీసులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఉన్నతాధికారుల కళ్లుగప్పి.. డబ్బులు తీసుకుని కేసును నీరుగారుస్తున్నారని సమాచారం. జిల్లాలోని కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చట్ట విరుద్ధంగా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కళ్యాణదుర్గం సమీపంలోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ కిందిస్థాయి అధికారి ఇలాంటి వ్యవహారాలకు తెరలేపినట్లు సమాచారం. సంక్రాంతి పండుగ సమయంలో మద్యం సేవించేందుకు ఇద్దరు వ్యక్తులు కర్ణాటక టెట్రా ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగడానికి వెళుతుండగా ఆ అధికారి వారిని పట్టుకుని, స్టేషన్‌కు తరలించారట. కర్ణాటక మద్యం వ్యవహారాన్ని దాచి, బహిరంగ మద్యపానం కేసు నమోదు చేసి, స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని, ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు తీసుకున్నారని సమాచారం. ఇలాంటి వ్యవహారాలు ఆ స్టేషన్‌లో మామూలే అని అంటున్నారు.

అనంతపురం టౌన్, జనవరి 30: మాతాశిశు మరణాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు

మాతాశిశుమరణాలు పునరావృతం కారాదు

తీసుకోవాలని వైద్యులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మాతాశిశు మరణాలపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గతనెలలో జరిగిన రెండు మాత, ఆరు శిశుమరణాలపై ఆరా తీశారు. ప్రధానంగా హైరిస్క్ గర్భిణీల పట్ల ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యం చేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అవినీతిపై పోరాడుతున్నందుకే చంద్రబాబుపై కేసులు
మాజీ మంత్రి పరిటాల సునీత

చంద్రబాబు నిజాయితీ కోర్టులో తేలుతుంది

అనంతపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా న్యాయస్థానాల్లో ఆయన నిజాయితీ నిరూపితమవుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఇన్నర్ రింగు రోడ్డు అంశంపై వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో... విజయవాడ నుంచి ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతిపై పోరాడుతున్నారనే అక్కసుతోనే తమ నాయకుడికి అవినీతి మరకలు అంటించాలని సీఎం జగన్ చూస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక కేసులు నమోదు చేయించి తమ నాయకుడిని అక్రమంగా కొన్నాళ్లు జైల్లో పెట్టించారని మండిపడ్డారు. అయినా న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందన్న నమ్మకంతోనే చంద్రబాబు పోరాడుతున్నారని అన్నారు. అధికార గర్వంతో జగన్ అండ్ కో పెట్టిన కేసులు తప్పుడువని సుప్రీంకోర్టు తీర్పుతో స్పష్టమైందని ఆమె అన్నారు. హైకోర్టు చెప్పినా వినకుండా వైసీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందని, సుప్రీం తీర్పు జగన్‌కు చెంపపెట్టులాంటిదని అన్నారు. నిజం గెలవడం ఆలస్యం కావచ్చేమోగానీ అంతిమంగా నిజమే గెలుస్తుందనే విషయాన్ని ఇప్పటికైనా జగన్‌రెడ్డి అర్థం చేసుకోవాలని హితవు పలికారు. తమ నాయకుడు చంద్రబాబు నిర్వహిస్తున్న 'రా... కదలిరా' సభలకు వస్తున్న జనాన్ని చూస్తుంటే... ఆయనపై ప్రజలు ఎంత నమ్మకం పెట్టుకున్నారో అర్థమవుతోందని అన్నారు. టీడీపీకి ఐదు కోట్ల ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని ఆమె అన్నారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు ఎంతో దూరంలో లేవని అన్నారు. హత్యలు, ఆత్మహత్యలు, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు.. ఇలా అన్ని నేరాల్లోనూ రాష్ట్రం ముందంజలో ఉన్నందుకు ప్రభుత్వం సిగ్గుపడాలని అన్నారు. ఓట్లేసి గెలిపించి అధికారం కట్టబెట్టిన ప్రజలకు మంచి చేయడంలో జగన్ ప్రభుత్వం చివరన ఉందని విమర్శించారు. టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మరోసారి చంద్రబాబును సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జగన్‌రెడ్డి పెత్తందారీ తనంపై విసిగిపోయిన వైసీపీ నేతలంతా టీడీపీలో చేరుతున్నారని, త్వరలో వైసీపీ ఖాళీ కావడం ఖాయమని ఆమె అన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం హెచ్చరిక

అనంతపురం అర్బన్, జనవరి 30: సర్పంచుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం నాయకులు హెచ్చరించారు. మహాత్మాగాంధీ వర్థంతిని పురస్కరించుకుని.. సర్పంచుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట నల్ల కండువాలు ధరించి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు వేలూరి రంగయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.8,629 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం పెంచాలని అన్నారు. తమ న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. నిరసన దీక్షలకు జనసేన రాయలసీమ రీజినల్ ఉమెన్ కో ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, ప్రతాప్‌నాయుడు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూషణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న సర్పంచులు


ఏది నిజం..?

ఆక్రమణలే లేవు: అటవీశాఖ
243 మందికి పట్టాలిప్పిస్తాం: వైసీపీ

విడపనకల్లు (వజ్రకరూరు), జనవరి 30: అటవీ ప్రాంతాన్ని ఆక్రమించి.. పట్టాలు పొందేందుకు అధికార పార్టీ వారు సిద్ధంగా ఉన్నా.. అలాంటిదేమీ లేదని అటవీశాఖ అంటోంది. వజ్రకరూరు మండలంలోని జరుట్ల రాంపురం, పందికుంట అటవీ ప్రాంతంలో వైసీపీ నాయకులు పేదల ముసుగులో అడవులను ఆక్రమించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 590 మంది గిరిజనులకు పట్టాలు ఇచ్చారు. తాజాగా 243 మందికి పదిరోజుల్లో పట్టాలు ఇప్పిస్తామని వైసీపీ నాయకులు అంటున్నారు. అటవీ శాఖ అధికారులు మాత్రం అటవీ భూమిని సాగుచేసేందుకు వచ్చినవారిని వెనక్కు పంపుతున్నామని, ఒక్క ఎకరాన్నీ వదిలిపెట్టలేదని అంటున్నారు. వైఎస్సార్ హయాంలో 590 మంది రైతులకు రెండు ఎకరాలు ప్రకారం ఇచ్చినా.. సుమారు 1200 ఎకరాల అటవీ భూమిని కేటాయించినట్లే. ప్రస్తుతం వైసీపీవారు చెబుతున్నట్లుగా 243 మందికి రెండు ఎకరాలు ప్రకారం పట్టాలు ఇస్తే.. కనీసం 500 ఎకరాల అటవీ భూమి సాగులోకి వెళుతుంది. వజ్రకరూరు మండలంలో సుమారు 2,500 ఎకరాల అటవీప్రాంతం ఉంది. ఇందులో వైఎస్సార్ హయాంలో సుమారు 12 వందల ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. మిగిలిన భూమినీ కేటాయిస్తే అడవులు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. ట్రైబల్ చట్టం ప్రకారం 2006కు ముందు నుంచే అటవీ భూములను సాగు చేసుకుంటున్నవారు పట్టాలు పొందేందుకు అర్హులు. అలాంటివారిలో పలువురికి గతంలోనే పట్టాలు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత వందల మందితో జాబితా తయారు చేయడం విమర్శలకు తావిస్తోంది. అటవీశాఖ అధికారులు అధికార పార్టీవారికి సహకరిస్తున్నారని, డిన్నర్లకు, మామూళ్లకు లొంగుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చదును చేయడానికి అటవీ భూమిలో చెట్లు కొట్టేసిన దృశ్యం



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

టెట్.. డీఎస్సీ.. ఓ డ్రామా..!

ఒక్క నోటిఫికేషన్ కూడా వదలని వైనం
డీఎస్సీ కోసం 40వేల మంది ఎదురుచూపు
ఎన్నికలు వచ్చాయని నోటిఫికేషన్ హడావుడి

ఏటా జాబ్ క్యాలెండర్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అని గొప్పగా చెప్పుకుని అధికారంలోకి వచ్చిన వైసీపీ.. నిరుద్యోగులతో ఆడుకుంటోంది. అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు పూర్తవుతున్నా.. ఆ హామీ గురించి జగన్ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపించడంతో ఇప్పుడు టెట్, డీఎస్సీ అని ఓట్ల రాజకీయం మొదలుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల మంది వరకూ నిరుద్యోగులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇన్నాళ్లూ జగన్ ఆ ఊసే ఎత్తలేదు. పైగా ఉపాధ్యాయ ఖాళీలు లేవని, మిగులు టీచర్లు ఉన్నారని ప్రకటించారు. ఇప్పుడు ఉన్నట్లుండి డీఎస్సీ అంటున్నా.. ప్రకటించేదాకా అనుమానమే అంటున్నారు నిరుద్యోగులు.

- అనంతపురం విద్య

ఇన్నాళ్లూ ఖాళీలే లేవన్న ప్రభుత్వం

వేలాది మందికి కన్నీళ్లు

డీఎస్సీ కోసం జిల్లాలో 40 వేల మంది వరకూ ఎదురు చూస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2022 ఆగస్టులో టెట్ నిర్వహించారు. అప్పట్లో 43 వేల మంది వరకూ దరఖాస్తు చేశారు. పరీక్షలకు 28 వేల మంది వరకూ హాజరయ్యారు. ఆ తరువాత టెట్ నోటిఫికేషన్ విడుదల కాలేదు. దీంతో 2022-23, 2023-24 అకడమిక్ సంవత్సరాల విద్యార్థులు టెట్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి ఆరు నెలల ఒకసారి, ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వహించాలి. ఇన్నాళ్లూ పట్టించుకోని ప్రభుత్వం.. వారం నుంచి టెట్ అంశాన్ని తెరపైకి తెచ్చింది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను గురించి పూర్తిగా విస్మరించింది. 2018లో టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం.. ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదు. వేలాది మంది నిరుద్యోగులకు కన్నీళ్లు తప్పలేదు.



ఖాళీలే లేవన్నారు..

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ ఖాళీలపై గందరగోళాన్ని సృష్టించింది. స్కూళ్లలో ఎక్కడా ఖాళీలే లేవని చెప్పుకొచ్చింది. పైగా మిగులు టీచర్లు ఉన్నారని చూపించింది. 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లను తెరపైకి తెచ్చి, అత్తెరసు జీతానికి ఎంటీఎస్ కింద భర్తీ చేసింది. భారీగా పోస్టులు భర్తీ చేసినట్లు అధికార పార్టీ నాయకులు షో చేశారు. ఇక డీఎస్సీ నిర్వహించాల్సిన అవసరమే లేదన్నట్లు ప్రభుత్వం వ్యవహరించింది. తీరా ఎన్నికల సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చింది. వేలాది మంది నిరుద్యోగులు, వారి కుటుంబీలకు ఓట్లకు గాలం వేస్తోంది. మరో పక్షం రోజుల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ రానుంది. ఇలాంటి సమయంలో టెట్, డీఎస్సీ నోటిఫికేషన్‌పై విద్యాశాఖ మంత్రి ప్రకటనలు ఎన్నికల స్టంట్ అని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు.

ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు..



వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులు ఈ ప్రభుత్వంలో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని నోటిఫికేషన్ అంటూ హంగామా చేస్తున్నారు. ఎన్నికల సమయంలో డ్రామాలను నిరుద్యోగులు సహరించరు. జగన్‌ను గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారు.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

మరోసారి మోసం..

ఎన్నికల సీజన్ వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఇప్పుడు నిరుద్యోగులు గుర్తుకొచ్చారు. వాళ్లతో పాటు, వారి తల్లిదండ్రుల ఓట్లు దండుకోవాలని టెట్, డీఎస్సీ అంటూ హడావుడి చేస్తున్నారు. నాలుగున్నరేళ్లలో ఏనాడూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది లేదు. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తోంది. అందుకే డీఎస్సీ అంటూ షో చేస్తున్నారు.. ఈ ప్రభుత్వ పెద్దలకు నిరుద్యోగులు తప్పకుండా బుద్ధి చెబుతారు.



- గుత్తా ధనుంజయ నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు



డీఎస్సీ కోసం శిక్షణా తరగతులకు హాజరైన యువత (ఫైల్)

మహాత్ముడికి ఘన నివాళి

అనంతపురం కల్చరల్, జనవరి 30: జాతిపిత మహాత్మగాంధీ వర్థంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్యులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి క్లాక్‌టవర్ వద్దగల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేష్, ఆర్యవైశ్య మహాసభ సీనియర్ నాయకుడు పోతుల సురేష్ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సత్యం, అహింసే ఆయుధాలుగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు గాంధీజీ అని నాయకులు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఆర్యవైశ్యుడు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల మనోజ్, నాయకులు టంగుటూరి నాగభూషణ, కలవల సతీష్, శబరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడిని మరిచారు..



పూలహారం కూడా వేయకపోవడంతో బోసిపోయిన గాంధీజీ విగ్రహం

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీజీనే మరిచారు. దేశవ్యాప్తంగా మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. ధర్మవరంలో మాత్రం విస్మరించారు. పట్టణంలోని గాంధీసర్కిల్‌లో నేత కార్మికులకు చిహ్నంగా ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీ విగ్రహానికి వర్ధంతి రోజు కనీసం పూలమాల కూడా వేయలేదు. మహనీయుడిని స్మరించుకునేందుకు ఆయన విగ్రహం ఏర్పాటుచేసి, వర్ధంతి, జయంతి రోజుల్లో కనీసం నివాళి అర్పించకపోవడంపై పట్టణ వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

-ధర్మవరంరూరల్


డీఈఈకి అభ్యంతరాల పత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురంరూరల్, జనవరి 30: వార్షికాదాయ అవసర నివేదిక (ఎఆర్ఆర్), మల్టీ ఇయర్ టారిఫ్(ఎంఐటీ)పై ఒకేసారి కాకుండా వేరువేరుగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో తమ పార్టీ అభిప్రాయాలు, అభ్యంతరాలను మెయిల్ ద్వారా ఏపీఈఆర్‌సీ ఛైర్మన్‌కు పంపారు. అనంతరం డీఈఈ వివేకానందస్వామికి అభిప్రాయ, అభ్యంతరాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి ట్రూఅప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలన్నారు. మిగులు విద్యుత్ అమ్మకం గురించి చెప్పలేదన్నారు. డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.22,234.60 కోట్లు బకాయి ఉందనీ, దీంతో డిస్కంలు అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఆ భారం వినియోగదారులపైనే పడుతోందన్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ మొత్తాలు బాకీ పడ్డ వినియోగదారులు 2023 సెప్టెంబరు నాటికి ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.3,237.32 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదన్నారు. గత మూడేళ్లలో ఉమ్మడి అనంత జిల్లాలో 250మంది విద్యుత్ ప్రమాదాల్లో మరణించారన్నారు. 20ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎల్‌టీ లైన్లను హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ పథకం కింద 11కేవీ (హెచ్‌టీ)కి మార్చడమే ప్రమదాలకు కారణమన్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ముస్కిన్, లోకనాథ్ పాల్గొన్నారు.

కరోనాతో మృతిచెందిన వైద్యులకు నివాళి


నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

అనంతపురం టౌన్, జనవరి 30: కొవిడ్ అమరవైద్యుల దినంగా సందర్భంగా కరోనా మరణించిన వైద్యులు, వైద్యసిబ్బందికి జిల్లా ఆస్పత్రిలో పలువురు మంగళవారం నివాళులర్పించారు. ఇందులో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఐఎంఏ నాయకులు ఎండ్లూరి ప్రభాకర్, అభిషేక్‌రెడ్డి ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, సీనియర్ వైద్యులు నవీన్ కుమార్, ఆత్మారామ్, సౌజన్యకుమార్, రామస్వామి, ఐఎంఏ నాయకుడు మనోరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరిన పట్టుచీరల వర్క్స్ కార్మికులు

ధర్మవరం రూరల్, జనవరి 30: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టుచీరల వర్క్స్ అసోసియేషన్ సభ్యులకు చెందిన 30 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ధర్మవరంలో ఉన్న పట్టుచీరల వర్క్స్ కార్మికులకు గుర్తింపుకార్డులను అందజేస్తామని శ్రీరామ్ వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి చేనేత పథకానికి అర్హులుగా గుర్తిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డుతోపాటు ఇంటిస్థలం ఇచ్చి, ఇల్లుకట్టించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతోందని, అందరికి తగిన న్యాయం చేసి గుర్తింపు ఇస్తామని పేర్కొన్నారు.

పూలు విసిరి వేధించాడు

వైసీపీ కౌన్సిలర్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు

రాయదుర్గం టౌన్, జనవరి 30: 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలకు హాజరైన తనపై వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ డిష్ గోవిందు పూలు విసిరి, అసభ్యంగా ప్రవర్తించారని రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయదుర్గం జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల ముగింపు సభ జరిగింది. కార్యక్రమానికి అధికార పార్టీకి చెందిన చైర్‌పర్సన్ శిల్పతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు. వేదికపై కూర్చున్న తనపై సొంత పార్టీ కౌన్సిలర్ గోవిందు వెనుక నుంచి పూలు విసిరాని, దీంతో తోటి కౌన్సిలర్లు ఆయనను మందలించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆమె అర్బన్ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవంలోనూ గోవిందు తన అనుచరులతో రాళ్లతో దాడి చేయించారని వాపోయారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సైతం అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వెకిలి చేష్టలు చేస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేశానని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా స్పందించాలని ఆమె పోలీసులను కోరారు.

గొంతెండుతోంది..!


కళ్యాణదుర్గంలో తాగునీటి కోసం రాస్తారోకో చేస్తున్న మహిళలు (ఫైల్)

● కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తీవ్రమైన తాగునీటి సమస్య ● బిందెడు నీటి కోసం వ్యవసాయ తోటలకు పరుగులు ● 50 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
● కష్టాలు పడుతున్నా కన్నెత్తి చూడడం లేదు : అధికారులు, నాయకులపై ఆగ్రహం

కళ్యాణదుర్గం, జనవరి 30 : వేసవికి ముందే నీటి కష్టాలు చుక్కలు చూపిస్తున్నాయి. బిందెడు నీటి కోసం నానా ప్రయాసలు తప్పడం లేదు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. తాగునీటి ఎద్దడితో సుమారు 50 గ్రామాల ప్రజలు మైళ్లకు మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. బిందెడు నీరు దొరకాలంటే గగనంగా మారిపోయింది. కొందరు సర్పంచ్‌లు తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకు వస్తున్నా 350 అడుగుల నుంచి 450 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వినా నీరు పడడం లేదని వాపోతున్నారు. దీన్ని బట్టి చూస్తే పాతాళగంగ ఏ స్థాయిలో అడుగంటిపోయిందో అర్థం అవుతోంది. దీంతో కొత్తబోర్లు వేయడానికి ఎవ్వరూ సాహసించలేకపోతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే నెలల తరబడి మంచినీటి సమస్యతో సతమతం అవుతున్నారు.



● చాలా గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసే దుస్థితి నెలకొంది. కొద్దివరకు తాత్కాలిక ఉపశమనం లభించే శ్రీరామిరెడ్డి నీరు కూడా ఆగిపోవడంతో, సమస్య మరింత జఠిలంగా మారింది. ఈ కన్నీటి కష్టాలు ఇంకా ఎన్నాళ్లు అంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలో ఎడ్లబండిపై నీటి కోసం పొలాలకు వెళ్తున్న గ్రామస్థులు

● కంబదూరు మండల పరిధిలోని మర్రిమాకులపల్లిలో ఆరు నెలల నుంచి తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నారు. పొలాలకు కరెంటు వస్తే చాలు, బిందెడు నీటి కోసం బావుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎద్దుల బండ్లు, సైకిళ్లు, ఆటోల్లో నీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. ఇదే గ్రామంలోనే ఎంపీ తలారి రంగయ్యను మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిలదీశారు. అయినప్పటికీ సమస్య తీరలేదు.

● కళ్యాణదుర్గం పట్టణంలో సుమారు 50 వేల జనాభా ఉన్నారు. ఇక్కడా తాగునీటి ఎద్దడితో అల్లాడిపోతున్నారు. సాక్షాత్తు మంత్రి నియోజకవర్గమైన ఉషశ్రీచరణ్ ఇలాఖాలోనే కన్నీటి కష్టాలతో అష్టకష్టాలు పడుతున్నారు. పట్టణంలోని ఆర్డీటీ ఆసుపత్రి ఎదురుగా మహిళలందరూ ఖాళీ బిందెలు చేతపట్టుకుని గుక్కెడు నీరివ్వండి..అంటూ అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల నినాదాలు చేసి నిరసన చేపట్టారు. మంత్రి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు..ఇంత మంది ఉన్నా ఏ ఒక్కరూ తాగునీటి సమస్య పరిష్కరించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చిన్నారులకూ తప్పని నీటి కష్టాలు

పట్టించుకునే నాథుడే లేడు: చిట్టెమ్మ, కళ్యాణదుర్గం



తాగునీళ్లు ఉన్నాయా లేవా అని కాలనీల్లోకి వచ్చి అడిగే కౌన్సిలర్ కానీ, నాయకుడు కానీ కరువయ్యారు. కేవలం సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ఫోన్లు చేసి అడగటం తప్పా, కనీస అవసరమైన తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదు. బిందెడు నీటి కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ తోటలకు వెళ్తున్నాం. ఎన్ని సార్లు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించకపోతే రోడ్లపైకి ఎక్కి రాస్తారోకో చేపడ్తాం.

అష్టకష్టాలు పడుతున్నాం: గంగమ్మ, కళ్యాణదుర్గం

బిందెడు నీటి కోసం మైళ్లకు మైళ్లు నడవాల్సి వస్తోంది. వ్యవసాయ బావుల వద్ద నుంచి మోసుకుంటూ అష్టకష్టాలు పడుతున్నాం. ఇప్పటికైనా నీటి సమస్యను పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించి నిరసన చేపడ్తాం.



ఎవ్వరూ పట్టించుకోవడం లేదు : అలివేలమ్మ

ప్రజాప్రతినిధులు మా కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదు. నెలరోజులుగా సమస్య మరింత తీవ్రమయ్యింది. చివరికి చందాలు వేసుకుని ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుని ఉపశమనం పొందుతున్నాం. కూలీ పని చేసుకుని బతికే మేము నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడడం దురదృష్టకరం.



సమైక్యాంధ్ర కేసుల్లో టీడీపీ నేతలకు విముక్తి

● కేసు కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు ● మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఊరట

అనంతపురం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో నమోదైన కేసుల్లో ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఉద్యమంలో నమోదైన కేసులను కొట్టివేస్తూ విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. దీంతో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఊరట లభించింది. రాష్ట్రాన్ని విభజించొద్దంటూ వివిధ రూపాల్లో నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు, దిగ్బంధాలు నిర్వహించిన క్రమంలో దశాబ్దం క్రితం అనంతపురం వన్‌టౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా 147, 148, 336, 427, 506 రెడ్‌విత్ 14 సెక్షన్ల కింద మాజీ మంత్రులు పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధి, గోనుగుంట్ల సూర్యనారాయణ, నాయకులు బీవీ వెంకటరాముడు, బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, ప్రకాష్‌నాయుడు, స్వామిదాస్, కృష్ణకుమార్, సరిపూటి రమణ, మణికంఠ బాబు, వెంకటప్ప, మరూరు గోపాల్, సద్దల చెన్నప్ప, కూచి హరి, నారాయణస్వామి, గోనిపట్ల శీనా, ఎల్లుట్ల వెంకటస్వామిలతో పాటు గతంలో టీడీపీలో ఉండి ప్రస్తుతం వైసీపీలో ఉన్న నదీం అహమ్మద్, మహాలక్ష్మి శ్రీనివాస్‌లపై అప్పట్లో కేసులు నమోదు చేశారు. ఆ కేసులకు సంబంధించిన విచారణ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో సుదీర్ఘంగా సాగింది. పలు వాయిదాల అనంతరం మంగళవారం సమైక్యాంధ్ర ఉద్యమంలో నమోదైన కేసులను కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు వెలువరించడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా... ఈ తీర్పుపై మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధులు స్పందిస్తూ... రాష్ట్రం ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతో సమైక్యాంధ్ర ఉద్యమంలో పోరాడామన్నారు. ఆ రోజుల్లో రాష్ట్ర విభజన జరగొద్దని కేసులకు వెరవకుండా ప్రజల పక్షాన ఉద్యమించామన్నారు. తెలుగుప్రజలు ఐక్యంగా ఉండాలని అనేక కార్యక్రమాలు చేశామన్నారు. ఆ క్రమంలోనే తమతోపాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయన్నారు. కోర్టు తీర్పు సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు


కోర్టు బయట హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు


రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు, జనవరి30: శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండ-మక్కాజిపల్లి మధ్య ట్రాఫిక్ సమస్య కారణంగా పలు రైళ్లను దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. జైపూర్-మైసూర్ (నెం. 12976) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 31న, ఫిబ్రవరి 5న ధర్మవరం, బసంపల్లి, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, నారాయణపురం, పెనుకొండ స్టేషన్ల మీదుగా మళ్లించనున్నారు. కాచిగూడ-యశ్వంతపూర్ (నెం. 20703) రైలును, మైసూరు-జైపూర్ (నెం. 12795) రైలును ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకూ, కోర్బా-యశ్వంతపూర్ (నెం.12252) రైలును ఫిబ్రవరి 1, 2 తేదీల్లోనూ, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (నెం.22684)ను ఫిబ్రవరి 1న పెనుకొండ, నారాయణపురం, ప్రశాంతి నిలయం, బసంపల్లి మీదుగా మళ్లించనున్నారు.

● కర్ణాటకలోని కొప్పల్-గినిగెర స్టేషన్ల మధ్య ఏర్పడిన ట్రాఫిక్ బ్లాక్ కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. నరసాపురం-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 17225) రైలును ఫిబ్రవరి 2న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17226)ను 3న, హుబ్లీ-గుంతకల్లు-హుబ్లీ ప్యాసింజరు (నెం. 07337/38) రైళ్లను. బెళగావి-ఖాజీపేట్ (నెం.07335) రైలును ఫిబ్రవరి 3న, ఖాజీపేట్-బెళగావి (నెం. 07336) రైలును 4న రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

తుది జాబితాలోనూ అవకతవకలు

ఉరవకొండ, జనవరి 30: ఓటరు తుది జాబితాలో సైతం అవకతవకలు బయట పడుతూనే ఉన్నాయి. పలు పోలింగ్ కేంద్రాలలో మరణించిన వారు, డబుల్‌ఎంట్రీ, వలసవెళ్లిన వారి పేర్లు జాబితాలో దర్శనమిస్తున్నాయి. పట్టణంలో 129 పోలింగ్ బూత్‌లో 706మంది ఓటర్లు ఉన్నారు. ఆ జాబితాలో మృతి చెందిన వారి పేర్లు అలాగే కొనసాగించారు. వలస ఓటర్లను కూడా అలాగే ఉంచారు. వారి పేర్లు తొలగించాలని బీఎల్‌ఏలు ప్రతిపాదించినా తుది ఓటర్ల జాబితాలో ఓటర్లుగానే ఉన్నారు. 125పోలింగ్ కేంద్రంలో పలువురికి రెండేసి ఓట్లు ఉన్నాయి. స్త్రీ ఓటరు కాగా అక్కడ పురుషులకు సంబంధించిన ఫొటో ఉంది. పోలింగ్ కేంద్రం 105, 107లో కూడా డబుల్‌ఎంట్రీ ఓట్లు అలాగే ఉంచారు. ఉంచిన ఓట్లలో అధికశాతం వైసీపీ సానుభూతిపరులవే. వజ్రకరూరు మండలం ప్యాపిలిలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో సుమారుగా 50కి పైగా ఓట్లు ఉరవకొండ, ప్యాపిలిలో ఉంచారు. పాటిల్ ఆనంద్‌రెడ్డి కుటుంబానికి సంబంధించి ప్యాపిలి 196 కేంద్రంలో, ఉరవకొండ 132 కేంద్రంలో ఓట్లు ఉన్నాయి. గోపురం సత్యయ్యకు సంబంధించిన ఓట్లు 96, 138 పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయి. ఓట్లు తొలగించాలని టీడీపీ బీఎల్‌ఏ ఫిర్యాదు చేసినా అలాగే ఉంచారు.


రెండు చోట్ల నమోదైన ఓట్లు

టీడీపీతోనే బీసీల అభివృద్ధి, సంక్షేమం

● ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి


జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆలం నరసానాయుడు

నార్పల, జనవరి30: రాష్ట్రంలో బీసీల అభివృద్ధి, సంక్షేమం ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బీ పప్పూరు గ్రామంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య అధ్యక్షతన 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలం నరసానాయుడు మాట్లాడుతూ బీసీ ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ వారికే మొండిచేయి చూపుతోందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు చంద్రబాబు అన్ని విధాలుగా పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలపి బీసీల సత్తా నిరుపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డేర్ల సంఘం అధ్యక్షుడు వెంకట్, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు గంగులకుంట వెంకటరమణ, కుమ్మర రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పోతులయ్య, రాష్ట్ర కార్యదర్శి కురబ శివబాల, బీసీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శులు రాజన్న, బొల్లిగనారాయణస్వామి, జాఫర్‌వలి, ధనుంజయ, జనసేన మండల అధ్యక్షుడు రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, వడ్డేర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వన్నూరప్ప, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి నారాయణస్వామి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు బ్యాళ్ల నాగేంద్ర, జిల్లా అధికారప్రతినిధి పరుశురామ్, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి కోయ్యగురు పెద్దన్న, జిల్లా నాయకులు రంగారెడ్డి, లక్ష్మినారాయణ, తలారి కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అంతా రహస్యమే..!

● పశుసంవర్ధక శాఖలో గుట్టుచప్పుడు కాకుండా సహాయకుల బదిలీలు ● రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

అనంతపురం అర్బన్, జనవరి 30: పశుసంవర్ధక శాఖలో ఏ పనులుచేసినా ఆ శాఖ అధికారులు అత్యంత రహస్యంగా కానిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల ఆ శాఖలో సహాయకుల పోస్టులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 473 పోస్టులకు 919 మంది పరీక్ష రాయగా మెరిట్, రోస్టర్ మేరకు తొలి విడతలో 206 మంది అర్హత సాధించారు. కనీసం పత్రికల్లో ప్రకటించకుండానే సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు పంపించామని, అలాంటప్పుడు పత్రికలకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏమిటన్న ధోరణిలో ఆ శాఖ అధికారులు ప్రవర్తించడం గమనార్హం. తాజాగా ఇదివరకు జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వర్తించే పశుసంవర్ధక సహాయకుల బదిలీల ప్రక్రియను అత్యంత రహస్యంగా చేయడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో 219 మంది పశుసంవర్థక సహాయకులు పనిచేస్తున్నారు. వీరిలో 170 మంది తమను ఇతర ఆర్బీకేలకు బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం ఆయా సిబ్బంది బదిలీల కోసం పశుసంవర్ధక శాఖ అధికారులు రహస్యంగా కసరత్తు చేశారు. ఎలాంటి కౌన్సెలింగ్ చేయకుండానే సిబ్బంది ఇచ్చిన మూడు ఆప్షన్లలో అనుకూలమైన స్థానానికి బదిలీ చేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం. ఈ విధానంపై కొందరు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే స్థానానికి ఇద్దరు, ముగ్గురు మొదటి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించకుండా ఏ రకంగా స్థానాలు కేటాయిస్తారంటూ ఆందోళన చెందుతున్నారు. హడావుడిగా ఒక్క రోజులోనే బదిలీల ప్ర క్రియను ముగించేసి బుధవారం బదిలీల జాబితాను విడుదల చేసేందుకు ఆ శాఖ అధికారులు సిద్ధం కావడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడిల నేపథ్యంలోనే బదిలీల ప్రక్రియను కౌన్సిలింగ్ చేయకుండా హడావుడిగా చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సందట్లో సడేమియా అన్న చందంగా నేతల ఒత్తిడుల పేరుతో కొందరు అధికారులు తమకు అనుకూలమైన సిబ్బంది నచ్చిన ప్రాంతానికి బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై చొరవ తీసుకొని పారదర్శకంగా బదిలీల ప్రక్రియ జరిగేలా చూడాలని సిబ్బంది కోరుతున్నారు. మరి ఏ మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.


పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం

వాటర్ ప్లాంట్‌ను కూల్చిన వైసీపీ వర్గీయులు



వాటర్ ప్లాంటును కూల్చేసిన స్థలం వద్ద క్రిష్ణమోహన్ చౌదరి

ఆత్మకూరు, జనవరి 30: మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ వైసీపీ వర్గీయులు మంగళవారం కూల్చేశారని టీడీపీ మాజీ కన్వీనర్ క్రిష్ణమోహన్ చౌదరి అన్నారు. గ్రామంలో మంచి నీటిని సరఫరా చేయాలని దీన్ని ఏర్పాటు చేశామని, వైసీపీ అధికారంలోకి రాగానే దీన్ని బంద్ చేయించారని మండిపడ్డారు. దీనిపై కోర్టును ఆశ్రయించామని, అయినా వైసీపీ నాయకులు ఆ ప్లాంటు మూసివేయించారని అన్నారు. ప్రస్తుతం ఆ ప్లాంట్ వైసీపీ నాయకులు కూల్చి పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఖో-ఖోలో జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సెంట్రల్, జనవరి 30: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పురుషుల ఖో-ఖో క్రీడలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వీసీ శ్రీనివాసరావు, రెక్టార్ విజయకుమార్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ జోజిరెడ్డి విద్యార్థులను అభినందించారు. నియోకవర్గస్థాయి పోటీల్లో గెలుపొంది రూ.35 వేలు నగదు బహుమతి పొందడం అభినందనీయమన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే.. శిక్షలు తప్పవు

అనంతపురం సెంట్రల్, జనవరి 30: అడ్డదారుల్లో అధికారాన్ని తాకట్టుపెట్టి నిబంధనలు ఉల్లంఘిస్తే.. న్యాయస్థానాల్లో శిక్షలు తప్పవని ఎస్కేయూ యాజమాన్యానికి విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం వీసీ హుస్సేన్‌రెడ్డిని కలిసిన విద్యార్థి సంఘాల నాయకులు వర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై వివరించారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. టీచింగ్ అసిస్టెంట్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ కోర్టు ఆదేశాలతో నిలిపివేశారని, దీంతో తాత్కాలికంగా టీచింగ్ అసిస్టెంట్స్ పేరుతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని పేర్కొన్నారు. దీన్నే అదనుగా మాజీ వీసీ రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య అక్రమాలకు పాల్పడి అనర్హులను టీచింగ్ అసిస్టెంట్లుగా నియమించారన్నారు. ఇప్పుడు వారికి నెల వేతనం చెల్లించేందుకు రిజిస్ట్రార్ లక్ష్మయ్య అడ్డదారుల్లో యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలా అనేకాంశాల్లో నిబంధనలు ఉల్లంఘించి వాటిని సక్రమం చేసేందుకు కుయుక్తులు పడుతున్నారని, అదేదారిని కొనసాగిస్తే చిక్కుల్లో పడకతప్పదని వీసీని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, వంశీకృష్ణ, కళ్లప్ప, మంజు, మైనుద్దీన్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రామగిరి, జనవరి 30: స్థానిక ఐఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో మంగళవారం మైక్రో లెండింగ్‌లో భాగంగా పలు కాలనీల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వన్నూర్‌స్వామి మాట్లాడుతూ... ఈ సంస్థ మన రాష్ట్రంలో రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపడుతున్న సహాయ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు మేనేజర్ శ్యాము, రీజనల్ మేనేజర్ హుస్సేన్‌వలీ, డీపీఆర్‌ఓలు సుంకన్న, జయన్న, డివిజనల్ మేనేజర్ భీమేశ్వరయ్య, డీలర్లు నరసింహమూర్తి, తిరుపాలు, మండల ఎగ్జిక్యూటివ్ నాగమణి పాల్గొన్నారు.

విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులివ్వాలి



కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు, ఉద్యోగులు

అనంతపురం విద్య, జనవరి 30: విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సెరికల్చర్ కమిషనర్ శ్రీధర్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమిరెడ్డి, ఇతర ఉద్యోగులు గుంటూరులో కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రమోషన్ల సీనియార్టీ జాబితా తయారీలో తమకు అన్యాయం జరిగిందని కొందరు కోర్టుకు వెళ్లారని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది సెరికల్చర్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులపై ప్రభావం పడిందని అన్నారు. క్రమంలో సహేతుకమైన అభ్యంతరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని, మెజార్టీ ఉద్యోగులకు న్యాయం జరిగేలా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

ఘనంగా పెద్దమ్మకు బోనాలు



గార్లదిన్నె, జనవరి 30: గార్లదిన్నెలో పెద్దమ్మ అమ్మవారికి భారీ సంఖ్యలో భక్తులు బోనాలు సమర్పించారు. వర్షాలు విస్తరంగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మకు బోనాలు సమర్పించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

కొనసాగిన 'సెర్ప్' సమ్మె



దీక్ష చేస్తున్న డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30: తమ న్యాయమైన సమస్యలను వైసీపీ ప్రభుత్వం పరిష్కరించాలని సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులు తలపెట్టిన సమ్మె రెండో రోజైన మంగళవారమూ కొనసాగింది. స్థానిక కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్లు మల్లికార్జున, నాయకులు శ్రీరాములు, హుస్సేన్, ఆంజనేయులు, వీరాస్వామి, రాజశేఖర్, సుభద్రమ్మ, ఈశ్వరయ్య, రమేష్‌రెడ్డి, సత్యనారాయణ, ఏసోబు, నాగార్జున, అరుణమ్మ, సురేఖ, రామ్మూర్తి, నీలారెడ్డి, మధుసూదన్, మల్లికార్జున, రాధమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, జనవరి 30: కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ప్యాదిండి ఈశ్వర్‌రెడ్డి రెండు రోజుల క్రితం మరణించాడు. ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులు, టీడీపీ గ్రామాధ్యక్షుడు గంగిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, దేవరాజు, రామచంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాగేంద్ర, మల్లి, సుబ్రహ్మణ్యం, తలారి రాజప్ప, బాలునాయక్, క్రిష్ణయ్య, ఓబిలేసు, ఓబుళపతి ఉన్నారు.

మాదిగల ఆత్మీయ కలయిక

అనంతపురం సెంట్రల్, జనవరి 30: స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో మాదిగల ఆత్మీయ కలయికను మంగళవారం నిర్వహించారు. మాదిగలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అన్యాయాలను ఎదురించాలంటే ఐకమత్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని ఆ వర్గం నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో 'నా మాదిగలంటూ' కల్లబొల్లి మాటలతో మాయం చేసి.. అధికారం చేపట్టగానే హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెల 11న నిర్వహించే ఆత్మీయ మహాసభను రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాకే హరి, జేబీ సురేష్, నాగభూషణ, హనుమంతు, సుదర్శన్, నారాయణస్వామి, వెంకటేష్, రామాంజినేయులు, ముత్యాలు, నరసింహులు, చంద్రశేఖర్, ప్రసాద్, అంజి, మల్లి పాల్గొన్నారు.





అనంతపురం, రామగిరిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శిక్షకులు

ఓటరు జాబితాపై దృష్టి పెట్టండి

అనంతపురంరూరల్, జనవరి 30: ఓటర్ల తుది జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని, దొంగ ఓట్లు, డబుల్, ట్రిబుల్ ఓట్లను గుర్తించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని ఇంటిగ్రేటెడ్ శిక్షకులు మనోహర్ నాయుడు, గణేష్ సూచించారు. స్థానిక అరవింద్‌నగర్‌లోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మండలంలోని క్లస్టర్ ఇన్‌చార్, బీఎల్‌ఏలు, బూత్ కన్వీనర్లకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాముదురాయి రఘు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళీ మోహన్ పాల్గొన్నారు.

రామగిరి: టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఇంటిగ్రేటెడ్ శిక్షకులు సామ కోటి ఆదినారాయణ, భరత్‌కుమార్ సూచించారు. స్థానిక రామగిరి టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఓటర్ల జాబితాపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ ఎంపీపీ పరందామ యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, నాయకులు ఎస్ అంజనేయులు, అక్కులప్ప, శివకుమార్, గుర్రం శీనా, పోతన్న, దుబ్బార్లపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ఓటర్ల తుది జాబితాలోనూ ఇంకా అనేక అవకతవకలు ఉన్నాయని, వాటిని గుర్తించాలని ఇంటిగ్రేటెడ్ ట్రైనీలు పరిమల, కాంతారాజు సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని బూత్ కన్వీనర్లకు మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తప్పులను వెంటనే బీఎల్‌ఓల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు రాజు, ముత్యాలప్ప, చంద్రాయుడు పాల్గొన్నారు.

రాప్తాడు: టీడీపీ స్థానిక కార్యాలయంలో టీడీపీ బీఎల్‌ఓఏలు, భూత్ ఇన్‌చార్జ్‌లతో మంగళగిరి పార్టీ కార్యాలయ ఇంటిగ్రేటెడ్ శిక్షకుడు గుణశేఖర్ సమావేశం నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఓటరు జాబితాలో దొంగ ఓట్లను గుర్తించి ఫిర్యాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకురాలు బేబి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ రమేష్, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఓబులేసు, నవీన్‌కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు క్రిష్ణమోహన్ చౌదరి, వెంకట నారాయణ, వేణుగోపాల్, మండల నాయకులు సుబ్బర హరి, రాజారమేష్, బాలానాయక్, గుజ్జుల వెంకటేసులు, అశ్వర్థరెడ్డి, ఉమాపతి, అక్కులన్న, బొమ్మయ్య, పోతన్న, లక్ష్మిదేవి, పార్వతమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

రూ.కోట్ల విలువైన స్థలాలు వైసీపీ కబ్జా

మున్సిపల్ ఆస్తులు కాపాడాలని కమిషనర్‌కు సీపీఐ వినతి

అనంతపురం విద్య, జనవరి 30: నగర పాలక సంస్థ పరిధిలో రూ. కోట్ల విలువైన స్థలాలను అధికార పార్టీ నేతల కబ్జా చేశారని, వాటిని కాపాడాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మేఘాస్వరూప్‌కు ఆయన చాంబర్‌లో మంగళవారం వినతి పత్రం అందజేసిన సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడారు. నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో సర్వేనెంబర్ 179-1లో సుమారు 50 సెంట్లు 1985లో ప్రజా ప్రయోజనాలకు కోసం ఇచ్చిన స్థలం కబ్జా చేసేందుకు యత్నాలు సాగుతున్నాయన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏడు ఎకరాల సెంట్రల్ పార్క్ స్థలంలో 1.50 ఎకరాలు స్థలం కబ్జాకు గురవుతున్నా... అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. శ్రీనగర్ కాలనీ లోని సర్వేనెంబర్ 40-2000, 353లోని మూడు సెంట్ల స్థలాన్ని అధికార పార్టీ నేతలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఇలా రూ.కోట్ల విలువైన స్థలాలు అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు కబ్జా చేస్తున్నారని, దీనిపై సీపీఐ ఆధ్వర్యంలో అనేకసార్లు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, రూ.కోట్ల విలువైన స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమణ, అల్లిపీరా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆనంద్, కార్యదర్శి సంతోష్, నాయకులుచాంద్‌బాషా, రజాక్, మున్నా, నాగప్ప పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

బాల్యవివాహాలను అడ్డుకుందాం

అనంతపురం విద్య/క్లాక్‌టవర్, జనవరి 30: అందరి సహకారం, భాగస్వామ్యంతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయగలమని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం ప్రశాంతి జిల్లా సమాఖ్యలో మండల సమాఖ్య లీడర్లతో బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల్య వివాహాల నిలుపుదల నిబంధనలు-2023, జీవోలు 31,39, బాలలపై లైంగిక దాడుల నిర్మూలన అంశాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు అన్న సామాజిక రుగ్మత కారణంగా బాలికల భవిష్యత్తు అంధకారంలో పడుతోందన్నారు. అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నా జిల్లాలో అక్కడక్కడా గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేసినప్పుడే ఇవి నియంత్రించగలమన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఐసీడీఎస్, చైల్డ్ లైన్ 1098 అధికారులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులకు సన్మానం

అనంతపురం రూరల్, జనవరి 30: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ వాల్మీకి సాధికార కమిటీ కోశాధికారిగా, అధికార ప్రతినిధిగా ఎన్నికైన టపాల రాజు, కందుకూరు దాదులూరును టీడీపీ నాయకులు మంగళవారం ఇటుకలపల్లిలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అక్కులప్ప, మాజీ సర్పంచు శ్రీరామ్‌నాయక్, కురబ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ రాగేమురళీమోహన్, టాపాల రాజేంద్ర, బోయ సాధికార సమితి ఉపాధ్యక్షుడు సాకే బ్రహ్మ, మాధవరాజు, వెంకటరాముడు, నాగన్న, ఎం.వెంకటరాముడు, మారుతి, తిమ్మప్ప, పెద్దన్న, కాటమయ్య, రాము, ఓబుళపతి, చిన్నకృష్ణ, రాములు, రమేష్, ఎ.రమేష్, ఉప్పరపల్లి నరేష్ పాల్గొన్నారు.

చీనీచెట్ల నరికివేత

శింగనమల, జనవరి 30: పొలం దగ్గర చిన్నపాటి తగాదతో తమ పొలంలోని పది చీనీ చెట్లను నరికివేశారని పెద్ద జలాలపురం వాసి ఈడిగ నడిపి సుబ్బరాయుడు కుమార్తె నాగరత్నమ్మ వాపోయారు. ఈ మేరకు శింగనమల పోలీస్ స్టేషన్‌లో ఆమె మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. జూల్కాకాలువ పొలంలో సర్వేనెంబర్ 198-1లో నడిపి సుబ్బరాయుడు చీని పంట సాగు చేశాడు. రెండు రోజు కిందట పొలం పక్కనే ఉన్న రైతు ఆదెన్న కుటుంబసభ్యులు, సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు ఘర్షణ పడ్డారు. గాయపడ్డ ఇరువర్గాల వారూ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుబ్బరాయుడు పొలంతో ఐదు సంవత్సరాలున్న పది చీని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. ఆదెన్న అనుచరుడు గిరిస్వాములు వాటిని నరికివేశాడని నాగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీధర్,ఎస్ఐ చంద్రశేఖర్ ఆ పొలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

షికారీల స్థితిగతులు మార్చండి: జేసీ

అనంతపురం రూరల్, జనవరి 30: వెనుకబడిన షికారీల స్థితిగతులు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర శివారుల్లోని టీవీ టవర్ సమీపంలో ఎన్‌టీఆర్ కాలనీలో ఆయన పర్యటించారు. షికారీల స్థితిగతులను పరిశీలించారు. వారి వివరాలు పరిశీలించి.. ఉప్పరపల్లి వద్ద ఇంటి పట్టాలను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్లు బాలకిషన్, విజయలక్ష్మి సీఐ విశ్వనాథ్ చౌదరి ఉన్నారు.



షికారీలతో మాట్లాడుతున్న జేసీ

కుష్ఠుపై అవగాహన

అనంతపురం టౌన్, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సర్వజన ఆస్పత్రిలోని కుష్ఠు యూనిట్‌లో అవగాహన కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అనుపమ జేమ్స్, వైద్యులు గంగాధరరెడ్డి, శివారెడ్డి, సిబ్బంది నాగన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కల్లూరులో జయహో బీసీ సదస్సు

గార్లదిన్నె, జనవరి 30: కల్లూరులో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలని శింగనమల నియోజకవర్గం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వైసీపీ పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీపతికి జనసైనికుల సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 30: జనసేన పార్టీలో చేరిన కాయగూరల లక్ష్మీపతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆ పార్టీ నేత నజీర్ ఆధ్వర్యంలో మంగళవారం లక్ష్మీపతి ఇంటికెళ్లి ఆయనను సన్మానించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాశెట్టి సంజీవరాయుడు, ధీరజ్‌బాష, గౌస్‌పీరా, హర్ష పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. త్యాగరాజస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం నగరానికి చెందిన పలువురు కళాకారులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. బెంగుళూరుకు చెందిన సంగీత విద్వాంసులు అభిరామ్ బృందం నిర్వహించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో విజయవాణి సంగీత కళానిలయం నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ, సంగీత కళాకారులు విశ్వజిత్, సునీల్ సుబ్రహ్మణ్యం, కార్తీక్, లతాశ్యాం, వైదేహి చైతన్య, శ్రీదేవి, రమామణి పాల్గొన్నారు.

మిల్క్ యాక్టుపై అవగాహన

అనంతపురం అర్బన్: స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో మంగళవారం మిల్క్ యాక్టుపై వెటర్నరీ వైద్యులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... వెటర్నరీ డాక్టర్లను మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రభుత్వం నియమించిందన్నారు. మిల్క్ యాక్టుపై డాక్టర్లు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. త్వరలో పాల నాణ్యత పరీక్షల పర్యవేక్షణ కోసం క్షేత్ర స్థాయిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీడీలు రమేష్‌రెడ్డి, వెంకటేశ్, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యూనియన్ బ్యాంకు

అనంతపురం క్లాక్‌టవర్: సామాజిక సేవలో భాగంగా యూనియన్ బ్యాంకు ఉరవకొండలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించింది. మంగళవారం వాటిని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సునీతకు ఆ బ్యాంకు ఆర్ఎం జితేంద్ర కుమార్ మిశ్రా, మేనేజర్ రామాంజినేయులు స్వాధీనం చేశారు.

ఏడీసీసీ బ్యాంకు తనిఖీ

అనంతపురం క్లాక్‌టవర్: స్థానిక ఒకటో రోడ్డులోని ఏడీసీసీ బ్యాంకును చైర్‌పర్సన్ లిఖిత మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలనపై ఆరా తీశారు. ఎన్‌పీఏలు తగ్గించి, రుణ వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్లు శిరీష, స్వర్ణ లత, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు టైర్ల దొంగ సవాల్

మళ్లీ అదే వాహనం టైర్ చోరీ



చోరీకి గురైన టైర్

అనంతపురం క్రైం, జనవరి 30: ఎవరు నిద్ర పోతున్నారో తెలియదు కానీ.. ఒకే ప్రాంతంలో రెండు చోట్ల చోరీ జరగడం పోలీసులకైతే కాస్త సిగ్గుగా అనిపించే విషయం. పాతూరులోని చెరువు కట్ట ఎదుట ఉంచిన ఓ బొలెరో వాహనం టైర్ దొంగలించిన విషయం తెలిసిందే. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో బాధితుడు ఏమీ చేయలేక రూ.14వేలు వెచ్చించి మరో టైర్, డిస్క్ కొనుగోలు చేశారు. సోమవారం రాత్రి అక్కడే వాహనాన్ని ఉంచారు. మంగళవారం ఉదయం చూస్తే మరోసారి కొత్త టైర్‌ను దొంగలించారు. వస్తువు చిన్నదా, పెద్దదా అన్న విషయం పక్కన పెడితే ఒకే ప్రాంతంలో వరుసగా రెండ్రోజుల పాటు దొంగతనం జరిగిందంటే అది పోలీసుల నిర్లక్ష్యమేననేది స్పష్టంగా తెలిసిపోతోంది. ఏది ఏమైనా పోలీసులకు ఇది షేమ్ కలిగించే విషయమే. బాధితుడు తనకు న్యాయం చేయాలని కోరుకుంటున్నాడు. కాగా, ఆ దొంగ పోలీసులకు సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తోంది.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నారాయణ (ఫైల్)

రాప్తాడు, జనవరి 30: మండలంలోని లింగనపల్లి క్రాస్ వద్ద జాతీయరహదారిపై మంగళవారం బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, బొమ్మేపర్తి వాసి నారాయణ (61) మరణించాడు. అనంతపురం నగరంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న అతను బొమ్మేపర్తిలోని తన చిన్న కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి అనంతపురానికి బైక్‌పై బయలుదేరాడు. లింగనపల్లి క్రాస్ వద్ద బెంగుళూరు నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఓ కారు అతని బైక్‌ను ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాప్తాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు..

నార్పల, జనవరి 30: బైక్ ఢీకొనడంతో స్థానిక సుల్తాన్‌పేట వాసి రామలక్ష్మమ్మ (60) మరణించింది. మంగళవారం స్థానిక సుల్తాన్‌పేట సమీపంలోని డిమార్ట్‌లో సరుకులు కొనుగోలు చేయడానికి రామలక్ష్మమ్మ రోడ్డు దాటుతుండగా.. షేక్ హుసేన్ అనే యువకుడు అతి వేగంగా బైక్‌పై వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామలక్ష్మమ్మను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్లు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామలక్ష్మమ్మ కుమారుడు సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడి దారుణహత్య

అనంతపురం క్రైం, జనవరి 30: గార్లదిన్నె మండలం జంబులదిన్నె కొట్టాల వాసి శ్రీనివాసులు నాయక్ కుమారుడు రాజేష్‌నాయక్ (28) దారుణహత్యకు గురయ్యాడు. ఇతనికి రెండేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలానికే భార్యను వదిలేశాడు. అప్పటి నుంచి అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కృపానంద టమోటామండీలో పనిచేస్తున్నాడు. చంద్రబాబునాయుడు కొట్టాలకు చెందిన బెస్త వీరాంజనేయులు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. టమోటా మండీలోకి తన ఆటోలో కూలీలను తీసుకొచ్చేవాడు. ఆ క్రమంలో వీరాంజనేయులు, రాజేష్‌నాయక్ మధ్య పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. తరచూ వీరాంజనేయులు ఇంటికి వెళ్లేవారు. ఇటీవల వారి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో వీరాంజనేయులు రాజేష్‌నాయక్ హత్యకు కుట్రపన్నాడు. అందులో భాగంగా వీరాంజనేయులు సోమవారం రాత్రి రాజేష్‌నాయక్‌తో మద్యం తాగుదామని చెప్పి సీవీ రామన్ కళాశాల వెనుకవైపున్న బయలు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అర్ధరాత్రి వీరాంజనేయులు తన వెంట తెచ్చుకున్న కత్తితో రాజేష్‌నాయక్ కడుపులో, మెడపైన పొడిచాడు. దీంతో రాజేష్‌నాయక్ అక్కడికక్కడే మరణించాడు. సంఘటనా స్థలాన్ని మంగళవారం ఉదయం రూరల్ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శ్రీనివాసులు నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. రూరల్ పోలీసులు వీరాంజనేయులును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మరో సర్వేయర్‌తో మా స్థలాన్ని కొలిపించండి

అనంతపురంరూరల్, జనవరి 30: మండల సర్వేయర్ ప్రతాప్‌రెడ్డితో కాకుండా మరో ప్రభుత్వ సర్వేయర్‌తో తమ ప్లాంట్లను కొలిపించి ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ పేర్కొన్నారు. ఆ మేరకు మంగళవారం ఆర్డీఓ వెంకటేష్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు. కురుగుంట గ్రామ సర్వే నెంబరు 41లో ఎంఆర్‌పీఎస్ నాయకులకు గతంలో పట్టాలు ఇచ్చారని, వాటికి కొలతలు వేసి తమకు కేటాయింపు చేయాలని తహసీల్దార్, గతంలోని ఆర్డీఓ చెప్పినా మండల సర్వేయర్ నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ సర్వేయర్ రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ దళితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఆ సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘననివాళి

శింగనమల, జనవరి 30: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రామస్వామి దేవాలయంలో ఆయన చిత్ర పటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ రామ్‌చరణ్‌యాదవ్, సీపీఎం నాయకుడు భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు(యాడికి)


కళ్యాణదుర్గం: ఎన్టీఆర్ భవన్‌లో గాంధీ చిత్రపటం వద్ద ఉమామహేశ్వరనాయుడు తదితరుల నివాళి


మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి(తాడిపత్రి)


కళ్యాణదుర్గంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

మహాత్ముడికి ఘన నివాళి

మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు మంగళవారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఉదయమే ఆయన విగ్రహాల వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో బాపూజీ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు(గుంతకల్లు టౌన్)


గడేకల్లులో గాంధీ వర్ధంతి నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(విడపనకల్లు)


గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు (రాయదుర్గం టౌన్)


గుత్తి: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

టీడీపీతోనే పేదల సంక్షేమం: మాజీ ఎమ్మెల్యే

గుత్తి, జనవరి 30: రాష్ట్రం అభివృద్ధి, పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. పట్టణంలో 17, 18వ వార్డుల్లో మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రకటించిన పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. టీడీపీ నాయకుడు నారాయణ స్వామి ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేశారు. ఈ సభను ఉద్దేశించి జితేంద్రగౌడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకం తప్ప అభి వృద్ధి లేదని విమర్శించారు. అన్ని రకాల పన్నులు, చార్జీలను పెంచి పేదలపై మోయలేని భారాలు వేశారని ఆయన విమర్శించారు. గుత్తి మున్సిపాలిటీలో ఎన్నడూ లేనివిధంగా తాగునీటి సమస్య నెలకొంద న్నారు. టీడీపీ హయాంలో రూ.173కోట్లతో నీటి సమస్య పరిష్కారం కోసం నిధులను మంజూరు చేస్తే నేటికి ట్యాంక్ నిర్మాణం పనులు పూర్తి చేయలేని దుస్థితి వైసీపీ ప్రభుత్వానిదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి


17వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న జితేంద్రగౌడ్

రాబోయేది టీడీపీ, జనసేన కూటమి అన్నారు. నాయకులు, కార్యకర్తలు టీడీపీ గెలుపుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు రవిశంకర్‌గౌడ్, బద్రివలి, పవన్‌కుమార్‌గౌడ్, టైలర్ బాషా, దిల్కాశీనా, అబ్దుల్‌జిలాన్, కృష్ణ సుంకన్న, రవిచౌదరి, శ్రీనివాస యాదవ్, శ్రీనివాసచౌదరి, ప్రతాప్, తలారిమస్తానప్ప, కేశవనాయుడు పాల్గొన్నారు.

నీటి పన్నులు తగ్గించండి

పామిడి, జనవరి 30: మండల కేంద్రంలో నీటి పన్నులు తగ్గించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 2021 నవంబరు 8న పామిడి నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మారిందన్నారు. పామిడి నగర పంచాయతీగా ఉన్నప్పుడు ఆరు నెలలకు రూ. 420లు చెల్లించేవారన్నారు. గతేడాది డిసెంబరులో నీటి పన్నులు చెల్లించాలని ఏడాదికి రూ.840లు ప్రకారం దాదాపు ఎనిమిది నుంచి పది సంవత్సరాల పన్ను ఒకేసారి చెల్లించేలా నోటీసులు జారీ చేశారన్నారు. గతంలో పంచాయతీలో చెల్లించిన ఇంటి పన్నులను చెల్లించినట్లే నీటి పన్నులు చెల్లించేలా సదుపాయం కల్పించాలని వారు కోరారు. పంచాయతీలో ఏడాదికి రూ. 240లు నీటి పన్ను చెల్లించామని అదే తరహాలో పన్నులు విధించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్, సీపీఐ నాయకులు కే రహీం, నాగరాజు, సీపీఐఎంఎల్ నాయకులు గజ్జల దస్తగిరి, చౌడప్ప పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేయించిన జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 30: పట్టణంలోని టైలర్స్‌కాలనీ ప్రధానరోడ్డు మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం చేయించారు. రెండు నెలల కిందట వైసీపీ మద్దతుదారులు అండర్‌డ్రైనేజీ మరమ్మతుల పేరుతో రోడ్డును పగులగొట్టి అలాగే ఉంచారు. మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, రేష్మాపర్వీన్, అరుణ, హాస్సేన్‌బాషా తదితరులు ఉన్నారు.


పనులను పర్యవేక్షిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

టీడీపీ విజయమే మనందరి ధ్యేయం: ఉమా

కళ్యాణదుర్గం, జనవరి 30: టీడీపీ విజయమే మనందరి ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా మహేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైసీపీ పాలనలోని అరాచకాలు, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు గ్రామాల్లో ప్రత్యేక చొరవ తీసుకుని, ఎప్పటికప్పుడూ వైసీపీ అరాచక పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, పోతుల లక్ష్మీ నరసింహులు, ఆదినారాయణ, నీలాస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, జనవరి 30: మండలంలోని కెంచానపల్లి గ్రామం వద్ద అనంతపురం స్పెషల్ పార్టీ పోలీసులు, సెబ్ సిబ్బంది దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ మురళీమోహన్ మంగళవారం పేర్కొన్నారు. సెబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. స్పెషల్ పార్టీ పోలీసులు, సెబ్ పోలీసులు కలిసి మండలంలోని కెంచానపల్లి వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సుధాకర్, పురంధరదాసు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్‌ను నియంత్రించండి

తాడిపత్రిటౌన్, జనవరి30: పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని బీజేపీ నాయకులు ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణంలోని నంద్యాలరోడ్డులో బుగ్గవైపు వెళుతున్న వాహనాలు పాతబ్రిడ్జి నుంచి వెళ్లకుండా, కుడివైపు నుంచి కొత్త బ్రిడ్జి గుండా వెళుతున్నాయన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వివరించారు. యల్లనూరురోడ్డు సర్కిల్, బస్టాండ్ సర్కిల్, గాంధీసర్కిల్‌తో పాటు పలు కూడళ్లలో ట్రాఫిక్ సమస్యతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శివ, రంగనాయకులు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్‌పై భారీ వాహనాలు వెళితే చర్యలు

పెద్దపప్పూరు, జనవరి30: మండలంలోని చాగల్లు రిజర్వాయర్‌పై భారీ వాహనాలు వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చెల్సీ ఏఈ హరినాథ్ తెలిపారు. గుర్తుతెలియని భారీ వాహనం మంగళవారం రిజర్వాయర్‌పై వెళ్లడంతో పైపు విరిగిందని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

గుంతకల్లు, జనవరి 30: అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ పిలుపునిచ్చాడు. పట్టణంలోని 36వ వార్డులో మంగళవారం ఉదయం ఆయన టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో కరపత్రాలను పంచి పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవ రాయుడు, బొజ్జేనాయక్, రామరాజు యాదవ్, అన్వర్, కేఎల్ సీన, కే జగదీశ్, దశరథ్ నాయక్, సంగాల రాము, చాంద్ బాషా, కే మీనా, సరస్వతి, బండారు పులికొండ, సుధాకర్, అశోక్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


36వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వెంకట శివుడు యాదవ్

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పట్టణంలోని 14వ వార్డులో మృతి చెందిన పార్టీ కార్యకర్త ఆటో రాజా కుటుంబాన్ని వెంకట శివుడు యాదవ్ పరామర్శించారు. మృతదేహంపై పూలమాలను వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

దారి ఆక్రమణపై ధర్నా

యాడికి, జనవరి 30: మండలకేంద్రలోని భైరవలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణం తొలగించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం ధర్నాకు దిగారు. టీడీపీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఆందోళనకారులు మాట్లాడుతూ రహదారిని ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టినప్పటి నుంచి అధికారుల వద్దకు తిరిగామని, పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించకపోవడంతో అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. దీనిని నిరసిస్తూ తాము ధర్నాకు దిగామన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు అధికారపార్టీ నాయకులకు తొత్తులుగా మారారని వారు ఆరోపించారు. ఇంటి నిర్మాణానికి అప్రూవల్ లేకున్నా అధికారులు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించి ఆలయానికి వెళ్లే దారిని పరిరక్షించేంత వరకు తాము ధర్నాను విరమించేది లేదని వారు తెలిపారు. ధర్నాతో యాడికిలో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు అక్కడికి వచ్చి ధర్నాను పంచాయతీ కార్యాలయంలో చేసుకొనేలా ఒప్పించారు. చివరకు గ్రామ పంచాయతీ అధికారులు, ధర్నాకు దిగిన వారితో మాట్లాడి అక్రమ నిర్మాణాన్ని తొలగింపజేశారు. ధర్నాలో ఆలయ కమిటీ సభ్యులు రఘు, శంకరాచారి, ఆర్ఎస్ఎస్ నాయకుడు గురప్ప, బీజేపీ మండల అధ్యక్షుడు గంగాధర్, టీడీపీ నాయకులు తిరంపురం నీలకంఠ, తాండ్ర విక్రమ్, మధురాజు, నారాయణస్వామి, నరసింహచౌదరి తదితరులు పాల్గొన్నారు.


రహదారి ఆక్రమణపై ధర్నాకు దిగిన గ్రామస్థులు

పాఠశాలకు పాల సరఫరాలో అవకతవకలు

కణేకల్లు, జనవరి 30: మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో గల గురుకుల పాఠశాలకు పాలను సరఫరా చేసే కాంట్రాక్టర్ అవకతవక లకు పాల్పడుతున్నాడని ప్రిన్సిపాల్ వెంకటనాయుడు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ప్రతి రోజూ 540 విద్యార్థులున్న గురుకుల పాఠశాలకు 50 లీటర్లు పాల సరఫరా చేయాల్సి ఉండగా సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా సరఫరా చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ అవకతవకలకు పాల్పడుతూ తక్కువగా పాలు సరఫరా చేయడమే కాకుండా నాసిరకం పాలను కూడా సరఫరా చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే తమపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని డీసీఓ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. కాగా కాంట్రాక్టర్‌కు వైసీపీ నాయకుల మద్దతు ఉండటంతో ఇష్టారాజ్యంగా పాలు సరఫరా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నాడు.


పాఠశాలకు సరఫరా చేసిన నాసిరకం పాలు

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

గుంతకల్లుటౌన్, జనవరి 30: గుంతకల్లు, బళ్లారి రైలు మార్గంలోని సాకిబండ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని 40 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మంగళవారం తెలిపారు. మృతురాలి ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉంది. కాళ్లకు మెట్టెలు లేవు, చేతికి గాజులు లేవు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా గ్రామదేవతల జాతర

బెళుగుప్ప, జనవరి 30: మండలంలోని విరుపాపల్లిలో మారెమ్మ కొల్లాపురమ్మ, గంగవరంలో మారెమ్మ, బూదివర్తిలో దుర్గమ్మ జాతరలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మండల టీడీపీ నాయకులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.


విరుపాపల్లిలో మారెమ్మ కొల్లాపురమ్మ దేవతల పూజలో పాల్గొన్న కేశవ్

చంద్రబాబుతోనే రైతులకు లబ్ధి

పుట్లూరు, జనవరి 30: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రైతులకు లబ్ధి చేకూరుతుందని శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లి, కడవకల్లు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులకు డ్రిప్పులేదు, ఎరువులు, విత్తనాలను సబ్సిడీతో ఇవ్వలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీసీ బాబు, గోవర్ధన్‌రాజు, ప్రసాద్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, రంగయ్య పాల్గొన్నారు.


అరటి రైతులతో మాట్లాడుతున్న శ్రావణిశ్రీ

ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

కూడేరు, జనవరి 30: ప్రకృతి వ్యవసాయంతో అన్నదాతలకు లాభదాయకమని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని కడదరకుంట, చోళసముద్రం గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను కమిటీ బృందం సభ్యులు పరిశీలించి రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించడంతోపాటు సాంప్రదాయ పంటలను సాగుచేసుకోవడంతో రైతులకు లాభదాయకమని డీపీఎం లక్ష్మ నాయక్ అన్నారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు షేక్‌మజీద్, నలిన్‌కిశోర్, దేశదీప్, సహదేవ్, ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న కమిటీ బృందం

నీటి గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, జనవరి 30: మండలంలోని గొల్లలదొడ్డి క్రాస్ వద్ద ఉన్న నీటి గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుడికి 45సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. నీలం రంగు టీ షర్టు, గోధుమ రంగు తెల్లని చెక్స్ ప్యాంట్ మృతదేహంపై ఉన్నాయన్నారు. కర్ణాటకకు చెందిన గోల్డెన్ బీడీల కట్ట కాగితం, అందులో విరిగిన మూడు బీడీ చుట్టలు, ఒక చిన్న దువ్వెన, రెండు చిక్ శ్యాంపులు ప్యాంట్ జేబులో ఉన్నాయన్నారు. ఒంటిపై ఎటువంటి ఆభరణాలు, పచ్చబొట్లు లేవన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ బోల్తా.. ఒకరి మృతి

తాడిపత్రిటౌన్, జనవరి30: పట్టణంలోని శ్రీనివాసపురంలో ప్రమాదవశాత్తు సైడు కాలువలో పడి మసూద్‌వలి (50) మృతి చెందాడని పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. నార్పలకు చెందిన మసూద్‌వలి కొంతకాలం కిందట కూలి పనులు చేసుకోవడానికి తాడిపత్రికి వచ్చాడు. పనినిమిత్తం ద్విచక్రవాహనంపై వెళుతుండగా శ్రీనివాసపురం వద్ద అదుపు తప్పి మురుగు కాలువలో పడిపోయాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌తో ప్రయోజనం

బెళుగుప్ప, జనవరి 30: ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ విధానంతో ఖాతాదారులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని రిజర్వ్‌బ్యాంకు అధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో ఆర్‌బీఐ డివిజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ బ్యాకింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ విధానం నగదుకు భద్రతతో పాటు ఆర్థిక లావాదేవీల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యరాజన్, ఎంఈవో మల్లారెడ్డి, ఎస్‌వో నాగరత్నాబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

తీవ్రమవుతున్న రస్తా వివాదం

పామిడి, జనవరి 30: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వెనుక గల ఓ వెంచర్‌లో రస్తా వివాదం రోజు రోజుకు తీవ్రమవుతోంది. స్థానికుల ఫిర్యాదుతో పంచాయతీ, అహుడా అధికారులు ఆ వెంచర్‌ను మంగళవారం పరిశీలించారు. కొలతలు వేసి రోడ్డుకు హద్దులు ఏర్పరచేందుకు ప్రయత్నాలు సాగించారు. అయితే ఆ వెంచర్‌కు సంబంధించిన వారు మాత్రమే అందుబాటులో ఉండడం, చుట్టు పక్కల గల వెంచర్ల వారు, డాక్యుమెంట్లు లేకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. దీంతో సమస్య ఎటూ తేలకుండా అలాగే ఉండిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.


వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధిపై సర్వే చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రాయదుర్గంరూరల్, జనవరి 30: మండలంలోని బీఎన్ హళ్లి గ్రామంలో జాతీయ సేవ ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఉపాధి, ఆదాయం తదితర అంశాలపై సర్వే నిర్వహించినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ నాగప్ప పేర్కొన్నారు. మంగళవారం జాతీయ సేవా ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆరో రోజు గ్రామంలో ఇంటింటికి తిరిగి ఉపాధి, ఆదాయంపై సర్వే నిర్వహించామన్నారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి గ్రామంలో పర్యటించి ఎన్ఎస్ఎస్ క్యాంపును సందర్శించి విద్యార్థులను అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: సీఐ

బొమ్మనహాళ్, జనవరి 30: గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు అని రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాలలో శాంతియుతంగా కలిసి మెలసి ఉండాలని అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ ఎంఈవోకు సన్మానం

కళ్యాణదుర్గం, జనవరి 30: ఉత్తమ ఎంఈవోగా మదన్‌మోహన్ అవార్డు అందుకోవడంతో ఉపాధ్యాయులు మంగళవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కంబదూరు ఎమ్మార్సీలో 1998 ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఎంఈవోకు పూలమాలలు, దుశ్శాలువాలు వేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల విజయోత్సవ ర్యాలీ

కుందుర్పి, జనవరి 30: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో మంగళవారం ఉపాధ్యాయుల బృందం, ఎంపీడీవో లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో కుందుర్పి మండల క్రీడాకారులు ప్రతిభను కనబరచడంతో ఉపాధ్యాయుల బృందం వారిని అభినందించింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 30: పట్టణంలో ఆదివారం భార్యపై భర్త దాడిని అడ్డుకోబోయి కత్తిపోట్లకు గురైన రాజన్న(43) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పట్టణానికి చెందిన దంపతులు సరస్వతి, సురేంద్ర మధ్య గొడవను ఆపేందుకు తోడల్లుడైన రాజన్న ఆదివారం భార్యతో కలిసి వెళ్లాడు. గొడవను ఆపే క్రమంలో కత్తిపోట్లకు గురయ్యాడు. ఆయన్ను చికిత్స కోసం అనంతపురం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడు సురేంద్ర కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

కూడేరు, జనవరి 30: మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కేశన్న (72) సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు అక్కడికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

జీడిపల్లిలో 0.458 క్యూసెక్కుల నిల్వ

బెళుగుప్ప, జనవరి 30: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.458 క్యూసెక్కుల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం వెల్లడించారు. ఇన్‌ఫ్లో 469 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 400 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు.

బేకరీలపై అధికారుల దాడులు

రాయదుర్గంటౌన్, జనవరి 30: పట్టణంలోని బేకరీలపై తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్ మంగళవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని బెంగుళూరు బేకరీ, న్యూ బెంగుళూరు బేకరీలలో శీతల పానీయాలు ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించి అపరాధ రుసుం విధించారు.

కల్లూరులో ఘర్షణ

యల్లనూరు, జనవరి30: మండలంలోని కల్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం స్వల్ప ఘర్షణ జరిగింది. పొలం విషయంలో సరోజమ్మ, లింగారెడ్డిల మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంలో సరోజమ్మ కుమారుడు నాగేశ్వరరెడ్డిపై లింగారెడ్డితోపాటు మరికొంతమంది దాడిచేశారు. ఈ దాడిలో సరోజమ్మ, నాగేశ్వరరెడ్డికి రక్తగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ వారు గెలిచారని చిన్నచూపు

అధికారుల తీరుపై మండిపడ్డ టీడీపీ సభ్యులు

కణేకల్లు, జనవరి 30: తమ గ్రామంలో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ స్థానం కూడా టీడీపీ వారే గెలవడంతో తమ గ్రామ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ సభ్యులు మండిపడ్డారు. ఎన్ని సమావేశాలు జరిగినా గ్రామంలో సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాపురం సర్పంచ్ జయరామచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర మాట్లాడుతూ తమ గ్రామంలో నెలకొన్న ఉపాధిహామీ సమస్యలు, తాగునీటి సమస్యలతో పాటు ఇతర సమస్యల గురించి అనేక సమావేశాల్లో లేవనెత్తినా అధికారులు ఇప్పటివరకు ఒక్కదాన్ని కూడా పరిష్కరించ లేదన్నారు. తమ గ్రామంలో టీడీపీ ఆధిక్యత ఉందని వైసీపీ నాయకులు, అధికారులు తమ గ్రామంపై కక్ష సాధిస్తున్నారని వారుమండిపడ్డారు.


ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగిన టీడీపీ సభ్యులు

యువచైతన్యయాత్రను విజయవంతం చేయండి

యాడికి, జనవరి 30: మండలంలో ఫిబ్రవరి 1నుంచి నిర్వహించే యువచైతన్య బస్సుయాత్రను విజయవంతం చేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాయలచెరువు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ టీడీపీకి విశేష ఆదరణ వస్తోందన్నారు. పెద్దవడుగూరు మండలంలో నిర్వహించిన బస్సుయాత్రనే ఇందుకు నిదర్శనమన్నారు. సైకో పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా అటకెక్కిందని తెలిపారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావడానికి తాను బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బస్సుయాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, వేలూరు రంగయ్య, పరిమి చరణ్, గోపాల్‌నాయుడు, మాదాల అనిల్, శ్యాంసుందర్ నాయుడు, రవికుమార్‌రెడ్డి, నరసింహులు, బొట్టు శేఖర్, విజయ్, శ్రీనివాసులు, లక్ష్మణ్, మోహిరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.